

పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం



వాకతిప్పలో ప్రచారం చేస్తున్న గోపి మూర్తి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టీచర్స్ ఎంఎల్సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని అంగర, మాచర, టేకి, కపిలేశ్వరపురం, వాకతిప్ప పాఠశాల లను సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరలు, విద్యుత్ భారాలు తగ్గించండి

మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలపై ధరలు, విద్యుత్ భారాలు తగ్గించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజా పోరులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని, ధరలు తగ్గించాలని, ఉపాధి కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ప్రజా పోరు కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను ఉపసంహరించాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక వర్గం ముగిసి 10 ఏళ్ల పూర్తయ్యిందన్నారు. నేటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో అధికారుల పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందన్నారు. తక్షణమే ఎన్నికలు జరిపి నగరంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి సంవత్సరం 15 శాతం అద్దె పన్ను పెంచి వసూలు చేస్తూ కనీస సౌకర్యాలను నగర వాసులకు అందించడం లేదని విమర్శించారు. రాజమహేంద్రవరం నగర పరిధిలో ఉదయం, సాయంత్రం రోజుకు రెండు గంటలు సురక్షిత తాగు నీరు అందించాలన్నారు. నూతన కుళాయి కనెక్షన్కు రూ.9 వేల కనెక్షన్ ఛార్జీలు వసూలు చేయడాన్ని తక్షణమే ఉపసంహరించాలన్నారు. కాలం చెల్లిన డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పూడ్చి, నూతనంగా రోడ్లు వేయాలన్నారు. రాజమహేంద్రవరం నగర కార్పొరేషన్లో విలీనం చేసిన గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలని కోరారు. నూతనంగా రెండు 10 ఎంఎల్ వాటర్ ట్యాంక్లను నిర్మించాలన్నారు. ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్లు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర ధరలు నియంత్రించాలని, పౌరసరఫరాల వ్యవస్థను పటిష్టం చేయాలని, ఎన్నికల హామీ అయిన ఉచిత ఇసుకను చిత్త శుద్ధితో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో, దేశంలో మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయని, వాటిని అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అప్పటి వరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను రక్షించాలన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే జమిలి ఎన్నికల ప్రతిపాదనను విరమించాలని ప్రజాస్వామ్య పాలన అందించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు పి.తులసి, టిఎస్.ప్రకాష్, ఎస్ఎస్.మూర్తి, పి.వెంకటేశ్వరరావు, సావిత్రి, బి.పూర్ణిమరాజు, పి.రామకృష్ణ, జి.తాతారావు, ఐ.సుబ్రహ్మణ్యం, జరీనా, ప్రశాంతి, అన్నపూర్ణ, మురళీ, శ్రీను, ఆర్.రామకృష్ణ, సోమేశ్వరరావు, రాంబాబు, భాస్కర్, రాజేష్, నాగమణి, ఉమ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



కడియంలో సమ్మె నోటీసు అందిస్తున్న 108 సిబ్బంది

25 నుంచి సమ్మెలోకి 108 సిబ్బంది

ప్రజాశక్తి - కడియం

సమస్యలను పరిష్కరించనందుకు ఈ నెల 25 నుంచి 108 సిబ్బంది సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు కడియం మండల 108 ఉద్యోగులు తహశీల్దార్, ఎంపిడిఒలకు గురువారం సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయన్నారు. ఈ సందర్భంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు, గ్రాట్యుటీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకుండా ఎగ్గొడుతూ ఉద్యోగులకు నష్టం చేస్తున్నాయని తెలిపారు. కావున 108 సర్వీస్ను నేరుగా ప్రభుత్వ నిర్వహించాలని కోరారు. జిఒ 49ని గత ప్రభుత్వం రద్దు చేసిందని, దీన్ని పునరుద్ధరించాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ (ఇఎంటి) పోస్టులకు ప్రభుత్వం నిర్ధారించిన అర్హత కలిగిన అభ్యర్థులు లేనందున విద్యార్హత సడలించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. వేతనాల స్లాబ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, ప్రతి నెలా 5వ తేదీ లోగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలన్నారు. రోజుకు 12 గంటలు పని చేయించుకు ంటూ కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ అదనపు పనికి అదనపు వేతనం చెల్లించడం లేదన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో అన్ని శాఖల్లో అమలవుతున్న విధంగా 108 వ్యవస్థలో కూడా రోజుకి మూడు షిఫ్ట్లలో 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. నాలుగేళ్లగా 40 శాతం ఇంక్రిమెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వాహనాల మరమ్మతుల ఖర్చులను ఉద్యోగుల జీతాల నుంచి కోత పెడుతున్నారని, సరిపడా సిబ్బంది లేక సెలవులు మంజూరు చేయకుండా ఉద్యోగి వ్యక్తిగత జీవితాన్ని హరిస్తున్నారన్నారు. మండలంలో 108 అంబులెన్స్ వాహనానికి, సిబ్బందికి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ నిర్వహణ సమయంలో మరణించిన ఉద్యోగికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో అందించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు ఆర్జిత సెలవులకు అరవింద సంస్థ నుంచి ఉద్యోగులకు చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వ ఉన్నత అధికారులకు అనేక దఫాలుగా వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరవధిక సమ్మెకు వెళు తున్నామన్నారు. ఈ పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు.



తాళ్లపూడిలో...

తాళ్లపూడి: ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్టు 108 సిబ్బంది ఎంపిడిఒ రమణ, తహశీల్దార్ రవీంద్రనాథ్కు సమ్మె నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది నానాజీ, భీమరాజు, జగపతికుమార్, నందిరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

'ప్రజా ధనం ప్రజా వినియోగం కోసం' నినాదంతో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 13వ మహాసభ ఈ నెల 16 నుంచి 19వరకూ కర్ణాటకలోని బెంగళూరులో జరుగుతున్నాయని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు ఎస్ఆర్జె. మాథ్యూస్, ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు-వాటి పరిష్కారాలు, ఎల్ఐసిలో క్లాస్-3, 4 కేడర్లలో తక్షణ రిక్రూట్మెంట్ కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఐఆర్డిఎ నిబంధనల మేరకు పాలసీదారుల ప్రయోజనాలు, సంస్థ ప్రయోజనాలు కాపాడటం అనే అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ముద్రించిన గోడ పత్రికలు, కర పత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.ఈశ్వరరావు, పిఎస్ఎన్.రాజు, సత్యదేవ, జి.శ్రీనివాస్, శిరీష, గన్నెయ్య, విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్బాబు, డి.శ్రీనివాస్, సాయిబాబా, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రభుత్వ ఆసుపత్రికి ఐరన్ సోఫాల బహూకరణ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి గోకవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఎఇ సిరపురపు సాంబశివరావు రెండు ఐరన్ సోఫాలను గురువారం ఆసుపత్రి వైద్యులు, అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ వనజాకుమారి, అభివద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, పిట్టా అరుణ్, అల్లాడ అరుణ, నియోజవర్గ యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండిగ గంగాధర్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావును డాక్టర్ వనజకుమారి, కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- పెరవలి

పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ 33/11 కెవి పరిధిలో ముక్కామల 'మల్లేశ్వరం ఫీడర్ మరమ్మతులు, ట్రీకటింగ్ నిమిత్తం ముక్కామల, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, ఖండవల్లి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ నారాయణఅప్పారావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుండి 8 గంటల మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంట వరకు అందిస్తామన్నారు. 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రం ఉసులుమర్రు పిడర్ పరిధిలో ఉసులుమర్రు పరిధిలో కానూరు అగ్రహారం కానూరు గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుండి 8 గంటల వరకు మధ్యాహ్నం1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

అంగటి సరుకుగా ఉచిత ఇసుక

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం కడియపులంక (బుర్రిలంక) ఇసుక ర్యాంపులో ట్రాక్టర్ల యజమానులు ఇసుకను ఇష్టానుసారంగా తోడుకుపోతున్నారు. ఇసుకను అంగటి సరుకుగా మార్చేసి సమీప గ్రామాలకు రూ.3 వేలు, సమీప మండలాలకు రూ.4 వేలకు ట్రక్కు ఇసుకను అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఫలితంగా నిజమైన వినియోగదారులకు ఉచిత ఇసుక అందని ద్రాక్షగా మారింది. గత ప్రభుత్వంలో కూడా ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ఇంత రేటు లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 7న ఉచిత ఇసుక నిబంధనలపై కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా ధ్రువ పత్రం పొంది ట్రాక్టర్ ద్వారా ఇసుకను తీసుకుని వెళ్ళవచ్చునని తెలిపారు. ఆ ఆదేశాలను లెక్కచేయని ట్రాక్టర్ల యజమానులు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను దోసుకుపోతున్నారు. ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.కాగా బుర్రిలంక ఇసుక ర్యాంపులో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ఎగుమతికి రూ.500, బాట ఛార్జి రూ.200 వసూలు చేస్తున్నారు. బుర్రిలంక ఇసుక ర్యాంపు నుంచి కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు వందల సంఖ్యలో ట్రాక్టర్ తరలించి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి ఇసుకను అంగటి సరుకుగా కాకుండా తక్కువ ధరకు వినియోగదారులకు అందేటట్లు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణదారులు కోరుకుంటున్నారు.



నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

నగరంలో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించి, టెండరు నిబంధనల ప్రకారము నిర్ణీత కాలంలో పూర్తి చేయించాలని కమిషనరు కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలవ్యవధి ప్రకారం పనులు పూర్తి కావటం లేదన్నారు. దీనిపై ఇంజినీరింగ్ అధికరులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి పనిని ఎమినిటీస్ సెక్రటరీలు, సహాయ ఇంజినీర్లు రోజూ పర్యవేక్షించాలన్నారు.కాంట్రాక్టర్లు, సహాయ ఇంజినీర్లు, ఎమినిటీస్ సెక్రటరీలతో కలిపి వారికి కేటాయించిన పనులపై సమీక్ష నిర్వహించాలని ఎస్ఇని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ తగదన్నారు. ఈ సమావేశంలో ఎస్ఇ జి.పాండురంగారావు, ఇఇలు షేక్ మదర్సా ఆలీ, పి.రీటా, ఎంవికె.మాధవి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, కె.సత్యనారాయణ, విరూపాక్షరావు, లోవరాజు, వెంకటలక్ష్మి, ఎఇలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అధికారులు, సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల శిక్షనా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. **ఉండ్రాజవరం** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వివివి.రామారావు అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. వాటిని డిజిటల్ టెక్నాలజీ ద్వారా, ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్లో పొందుపరిచే విధానంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్డి.ప్రసాద్, ఇఒపిఆర్డి కె.ఆంజనేయశర్మ, ఎంఇఒలు సిహెచ్.సక్సేనారాజు, డి.శారదజ్యోత్స్న, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఆర్ దుర్గాభవాని, ఐకెపి ఎపిఎం బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు. కాల్దరి కార్యదర్శి వి.శ్రీనివాస్, కె.సావరం డిజిటల్ అసిస్టెంట్ ఎ.సత్య నారాయణ టిఒటిలుగా వ్యవహరించారు. **గోకవరం** మహిళ సమైక్య భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులకు ఎంపిడిఒ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాగి ఇటిసి చైర్మన్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఇఒపిఆర్డి ఎం.రాజేశ్వరరావు, ఎపిఒ పిఎస్.అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **బిక్కవోలు** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికా రులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, విఒలకు శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. **పెరవలిలో** జిపిడిపీ శిక్షణ తరగతులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు డిపిఆర్సి ప్రసంగి రాజు, డిస్టిక్ లెవెల్ ఎంఒటి చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.అచ్యుత కుమారి, ఎంపిడిఒ సిహెచ్.వెంకట రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఘంటా శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు. **చాగల్లు** అన్ని శాఖల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ ఆర్.దేవి అన్నారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఆర్.శ్రవణ్కుమార్, ఎపిఎం శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకుని గ్రామాలను త్వరితగతిన అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ రమణ సూచించారు. తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి వీరన్న, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్యామ్సుందర్

సైబర్ క్రైమ్పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కోరుకొండ

ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్సుందర్ సూచించారు. కోరుకొండలోని రాజబాబు జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ కాల్స్, ఫేక్ యాప్స్, పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పొరపాటున అకౌంట్లో నగదు జమ చేశామని, తిరిగి జమ చేయండి అనే విధానంపై, ఇతర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫేక్ కాల్స్, ఫేక్ యాప్స్పై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ క్రైమ్ వల్ల నష్టపోయిన బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్కు గురైన వారు 24 గంటల్లోగా ఫిర్యాదు చేయగలిగితే సమస్య పరిష్కారానికి అవకాశముంటుందన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

బాలల దినోత్సవం జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. **రాజమహేంద్రవరం** ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలల దినోత్సవం వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడు, డిఎల్ఎస్ఎ కార్యదర్శి ప్రకాష్బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తు చేసుకున్నారు. లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లి తండ్రుల పేరు నిలిపేలా చదవాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి భవిష్యత్తు పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. విద్యతోపాటూ ఆటల్లోనూ రాణించాలన్నారు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవ రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, ఎపి ఎస్సి పిఆర్ మెంబర్ ఆదిలక్ష్మి, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ పి సూర్యప్రభావతి, డిసిపిఒ సి.రాజకుమార్, సిడబ్ల్యుసి మెంబర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** భాష్యం స్కూల్లో చిల్డ్రన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు ఎం.తిరుమలదాసు, కెఆర్ఎస్వివి.అప్పారావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్య, చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, సుదీషా ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **గోపాలపురం** శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ వెజ్జు సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈలి శరత్బాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. **చాగల్లు** శాఖ గ్రంథాలయంలోబాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఇఒలు సిహెచ్.సుభాకర్, యు.గురునాథం, జడ్పిహెచ్ హెచ్ఎం పి.వీర్రాజు రిటైర్డ్ ఎంఇఒ కోడి నాగేశ్వరావు, రిటైర్డ్ టీచర్ వి.గంగాధర్ గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్యవాడలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తొలుత బాలల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు కార్తీక వన సమారాధన ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థి పివిడి.రామరాజు విద్యార్థులకు 100 వాటర్ ఆపిల్ మొక్కలు, జెవిఎన్ బాపిరాజు, పి.రామకిష్ణంరాజు సహాయంతో అందించారు. **కడియం** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - 4,(మేకలదిబ్బ)లో బాలల దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఎంఎఇఒలు మణి కుమార్, నాగేశ్వరరావు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఆటలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. **గోకవరం** మండలంలోని రంప ఎర్రంపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు స్థాపించిన స్కూల్ మేట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేట్స్ ట్రస్ట్ అధ్యక్షులు కాకర విష్ణు, సర్పంచ్ బాదంపూడి హర్షిత, బి.ప్రకాష్, పిఎంసి చైర్మన్ గంట శ్రీను, హెచ్ఎం కె.వీర్రాజు, ప్రమీల రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నల్లజర్ల** తూర్పు చోడవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుడిగిన ఏడుకొండలు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రాజబాబు, ఉపాధ్యాయులు ఎల్.నాగరాజు, ఎఎస్వి.సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో...



విద్యార్థినిక బహుమతి అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలు రైల్వే ట్రాక్‌పై గొల్లప్రోలుకు చెందిన వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణ పరిధిలోని కరణం గారి తోటలో నివాసం ఉంటున్న తొగరు దివ్య(26) గురువారం తెల్లవారుజామున చేబ్రోలు సమీపంలో రైల్వే ట్రాక్‌పై అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె భర్త తొగరు రమేష్ ఎర్రవరం గ్రామంలో అవంతి ప్రో ఫుడ్స్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆమెకు మూడేళ్ల క్రితం వివాహం అయింది. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని తూర్పు గోనగూడెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు నౌకాదళానికి చెందిన సామగ్రిని వాహనంలో తీసుకుని వెళుతున్నారు. జాతీయ రహదారి ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి చేరుకునే సరికి హైదరాబాద్ నుంచి విశాఖ వెలుతున్న తుఫాన్ జీప్ నౌకాదళం వాహనం వెనుక వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న ఆశీష్ కుమార్ త్రిపాఠి(32), షేక్ షాబ్జీ (30) అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- కడియం

కడియం భాస్కర నగర్ ప్రాంతంలో రహదారి చెంతన విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభంపై 11కెవి విద్యుత్ లైను, అలాగే ఎల్‌టి లైన్‌తో పాటుగా 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. నెల రోజుల క్రితం నర్సరీ మొక్కల లారీ స్తంభాన్ని ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. అప్పట్లోనే విద్యుత్ సిబ్బంది లారీ డ్రైవర్ నుంచినష్టపరిహారంగా రూ.15 వేలు వసూలు చేశారన్నారు. కాని మరమ్మతులు మాత్రం చేయలేదన్నారు. ప్రతి రోజూ ఈ రహదారి గుండా అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, మొక్కలు లారీలు, అలాగే స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెను ప్రమాదం సంభవించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ఉన్నతాధికారులు స్పందించాలని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అసంక్రమిత వ్యాధులపై సర్వే

ప్రజాశక్తి - చాగల్లు

బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి గ్రామంలో ఈ నెల 14 నుంచి అసంక్రమిత వ్యాధులపై ఇంటింటా సర్వే జరుగు తుందని వైద్యాధికారి డాక్టర్ కె.నిషిత తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్య సిబ్బంది సందర్శించి ఇంటిలోని 30 ఏళ్లపైబడిన ప్రతి ఒక్కరికి మధుమేహం, రక్తపోటుపరీక్షలు నిర్వహిస్తారన్నారు. 18ఏళ్ల పైబడిన వారికి కేన్సర్ పరిక్షలు చేస్తారన్నారు. దీనికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిఆర్ఎల్.దేవి, ఎ.రామచంద్రరావు సూపర్ వైజర్ పి.రేవతి, నరసమ్మ, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఎ దంపతులు

ప్రజాశక్తి - బిక్కవోలు

బలభద్రపురం గ్రామం తాతానగరంలో చౌదరి గారి మిల్లు వద్ద జరిగిన సత్తెమ్మ తల్లి, పోతురాజు బాబుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో అనపర్తి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ కర్త పోతంశెట్టి గంగిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొవ్వూరి వెంకటరామారెడ్డి, సబ్బెళ్ళ వీర్రాఘవరెడ్డి, తేతల శ్రీనివాసరెడ్డి, మేడపాటి ఆనందరెడ్డి, కోణాల రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని గ్రామాల్లో కేన్సర్‌పై అవగాహనా ర్యాలీలను గురువారం నిర్వహించారు. వైద్యాధికారులు పి.తేజశ్రీ, కె.హేమరాజు మాట్లాడారు. గ్రామంలో ప్రతీ ఇంటిని సందర్శించి 18 ఏళ్లు నిండిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. సర్వేలో ఎవరైనా అనుమానిత లక్షణాలుంటే వైద్యాధికారి వద్దకు పంపించాలని తెలిపారు. నడుపల్లి గ్రామ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌కు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.సత్యేంద్రకుమార్, ఎంపిహెచ్ఇఒ ఎం.రాజసులోచన, పిహెచ్ఎన్ కెవి.నాగేశ్వరావు, ఎంపిహెచ్ఎస్ బి.విజయలకి పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పలువురిని మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు గురువారం పరామర్శించారు. చివటంలో ఆకస్మిక మరణం చెందిన చిలుకూరి సుబ్బారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెలగదుర్రులో ఇటీవల బాణాసంచా ప్రమాదంలో మరణించిన యాతం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. **రాజమహేంద్రవరం** సీతంపేట ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవము ఘనంగా ప్రారంభ మయ్యాయి. మారిశెట్టి సత్యనారాయణ. ఎం.మల్లికార్జునరావు, పిచ్చుక రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మారిశెట్టి సత్యనారాయణ సరస్వతి దేవి, నెహ్రు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. టౌన్ హై స్కూల్, ప్రగతి హై స్కూల్ విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. అలాగే ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, విశిష్ట అతిథి ఆదికవి. నన్నయ విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ జి.సుధాకర్ చేతుల మీదుగా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. **నల్లజర్ల** శాఖ గ్రంధాలయంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు గుదే సుశీల జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ సింహాద్రిరావు, ఎంఇఒ వై.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కిషోర్, ఉపాధ్యక్షులు జి.శ్రీరామ్మూర్తి కూచిపూడి పద్మావతి, మల్లిపూడి ఉరుమయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కడియం** గ్రంథాలయాల్లో చదువుకునే ఉన్నత స్థాయికి ఎదిగానని కడియం సబ్ రిజిస్ట్రార్ లక్ష్మి పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారిణి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఏడిద నాగేశ్వరరావు, హెచ్ఎం టి.సత్యనా రాయణ, విశ్రాంత ఎంఇఒ లజపతిరాయ్ పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** శాఖా గ్రంథాలయంలో మండల పంచాయతీ విస్తరణాధికారి కట్టమూరి ఆంజనేయ శర్మ పాల్గొని ప్రారంభించారు. లైబ్రేరియన్ గుత్తికొండ కస్తూరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పంచాయతీ కార్యదర్శి యు.ముత్యాలునాగ్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎ.శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు గొడవర్తి సత్యనారాయణ, విశ్రాంత ఆంగ్ల భాష అధ్యాపకులు కోట రామ ప్రసాద్, ఉపాధ్యాయులు వెంపటి వెంకటేశ్వర్లు, గుత్తికొండ స్రవంతి తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడిల** శాఖా గ్రంథాలయంలో తహశీల్దార్ రవీంద్రనాథ్, రైస్ మిల్లర్స్ సంఘం అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి జనార్దన్‌రావు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రీడర్స్ ఫోరం అధ్యక్షులు సిహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండలంలోని బల్లిపాడు ఎంపీపీ జేబీ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్ పర్సన్ ఇందుగ మెల్లి మౌనిక, వైస్ చైర్ పర్సన్ పల్లి ప్రసన్న విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాజమండ్రి సీతంపేట ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వారోత్సవాల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

క్షేత్ర స్థాయి అవగాహన కీలకం

ట్రైనీ ఐఎఎస్‌లకు కలెక్టర్ ప్రశాంతి సూచన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఐఎఎస్ శిక్షణలో క్షేత్రస్థాయిలో అవగహనను పెంచుకోవడం చాలా కీలకమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ట్రైనీ ఐఎఎస్‌లు ఆమెతో సమావేశ మయ్యారు. వారి ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఇండియన్ అడ్మిని స్ట్రేటివ్ సర్వీస్‌లో నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతో సమన్వ యంతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా ఏడు రోజుల పర్యటనలో తొలిరోజు అధికారులతో సమా వేశం, నగర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక అమలు, ఆరోగ్యం, పారిశు ధ్యంపై అవగాహన కల్పించామన్నారు. మున్సిపాలిటీ పాఠశాలను సందర్శించి పాఠశాల స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించా మన్నారు. మూడో రోజు మురికివాడలను కలిగి ఉన్న వార్డులను సందర్శించడం, వార్డు స్థాయి కార్యకర్తలతో సమావేశం, పౌరులు - పౌర కేంద్ర సేవలు, మురికివాడల అభివృద్ధి పథకాలు, పేద రికం, జీవనోపాధి మొదలైన ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శ కాలపై అవగాహన కల్పించనున్నట్లు ప్రశాంతి తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పర్యావరణ-పర్యావరణ సంబంధిత సమ స్యలపై కమ్యూనిటీ ముఖాముఖి సంభాషించనున్నట్లు పేర్కొ న్నారు. సంస్థాగత కార్యకలాపాల తీరును గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ, పిహెచ్‌సి, పంచాయతీ కార్యాలయం మరియు ఇతర సంస్థల వంటి స్థానిక సంస్థలను సందర్శిస్తారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చేపడుతున్న చర్యలపై అవగాహన, ప్రజలతో సమావేశమయ్య ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ గ్రామాభివృద్ధి ప్రణాళిక, నైపుణ్యం, వ్యవస్థాపకత, పౌరులకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సేవలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించిన బృందంలో మన్నన్ సింగ్, అనురాగ్ బబెల్, ప్రియా రాణి, షాహీదా బేగమ్, పార్థ్, కశీష్ భక్షి, స్నేహపన్న, జాదవ్‌రావు, నిరంజన్, మహేంద్ర సింగ్, తుషార్ నెగి, అతుల్ మిశ్రా ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - చాగల్లు

రైతుల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కు జిల్లా రైతు సంఘం కార్య దర్శి గారపాటి వెంకట సుబ్బారావు, మండల అధ్యక్షుడు కంకటాల బుద్ధుడు సిపిఎం మండల కార్యదర్శి కామిశెట్టి దుర్గారావు, భవన నిర్మాణ కార్మికుల నాయకులు షేక్ ఆదం, కె.తాతారావు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు నేటికీ రైతు భరోసా ఇవ్వలేదన్నారు. రోజుకు 9 గంటల విద్యుత్ ఇవ్వట్లేదన్నారు. నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, దీని వల్ల ప్రమాదలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తక్షణమే రోడ్లు వేయాలన్నారు. కామిశెట్టి దుర్గారావు మాట్లాడుతూ గ్రామంలో బస్‌షెల్టర్‌ను నిర్మించాలన్నారు. కంకటాల బుద్ధుడు మాట్లాడుతూ జైపూర్ షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో సివిల్ కేసులు, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగిన అన్ని ఇతర కేసులను గుర్తించి వాటిని అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ మేరకు పెండింగ్ లో ఉన్న అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, కాకినాడ జిల్లా అదనపు ఎస్‌పి ఎంజ.వి.భాస్కర్‌రావు, రామచంద్రాపురం డిఎస్‌పి బి.రామకృష్ణ, పిపిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

మధుమేహంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ఉండ్రాజవరం, వేలివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సిడి, ఎంసిడి సర్వేలో భాగంగా గురువారం వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించుకుని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడారు. షుగర్ వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్య అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.ఉషాదేవి, డాక్టర్ సృజన, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎం.సుబ్రహ్మణ్యం, ఎమ్‌డి.ఖాన్, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, కె.నాగమణి, ఆరోగ్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్స్, ఆశాలు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని హుకుంపేట, బాలాజీపేట ప్రాంతాల్లోని ఆక్రమణలను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీ లించారు. ఆవ డ్రెయిన్ పరిధిలోని 6.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించామన్నారు. వర్షాలు, వరదలు సమయంలో రాజమహేంద్రవరం నగరం, చుట్టూ పక్కల గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ముంపు సమస్య నివారణ చర్యల్లో భాగంగా ఆక్రణలను తొలగిస్తున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో పర్యటించి పలువురికి నోటీసులు ఇచ్చామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన చేపట్టిన అనధికార కట్టడాలను తొలగిస్తామన్నారు. ఆవ ఛానల్‌కి చెందిన డ్రెయిన్ ఆక్రమణలు విషయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో మరోదఫా సమన్వయ శాఖల అధికారులతో పర్యటించి ఆక్రమణల నిర్ధారణ చేయాలన్నారు. టింబర్ డిపో, సిద్ధార్థ స్కూల్ ప్రాంతం, బాలాజీ పేట ప్రాంతాల్లో విస్తత స్థాయిలో కలెక్టర్ పర్యటించారు. సిద్ధార్థ స్కూలుకు చెందిన భవనాలను 21 అడుగులు వెనక్కు తరలించి విషయం అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట రూరల్ ఎంపిడిఒ డి.శ్రీనివాస్‌రావు, రూరల్ తహశీల్దార్ కుమార్ ఉన్నారు.



పుట్టిన రోజు వేడుకల్లో నాయకులతో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

ఘనంగా ఎంఎల్ఎ మద్దిపాటి పుట్టినరోజు

నల్లజర్ల: గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పుట్టినరోజు వేడుకలు కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో స్థానిక స్టార్ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా జరిగాయి. సుమారు 20వేల మందికి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గంలోని పలు అనాధ శరణాలయాల్లోని వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రుల్లోని రోగులకు పాలు, పండ్లు, మిఠాయిలు పంచారు. నియోజకవర్గంలోని వేలాదిమంది నాయకులు కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి బ్రహ్మరాజు, ఎలమాటి శ్రీనివాసరావు. పసుమర్తి రతీష్, జె.వీరవెంకటసతీష్, టిడిపి మండల అధ్యక్షులు తాకిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో 18 మంది ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మెడిటెక్ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలు ప్రాథమిక స్థాయికి 18 మంది అర్హత సాధించారని ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు జిల్లా వ్యాప్తంగా 60 మంది హాజరయ్యారని తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు మెడిటెక్ టీం లీడర్ అంజన్ వివరాలు తెలిపి ఆన్‌లైన్ పరీక్షకు లింక్‌ను అందించారు. ఆన్‌లైన్‌లో అర్హత సాధించిన విద్యార్థులను ఫైనల్‌గా ఎంపిక చేసి ట్రైనింగ్‌కి పంపిస్తారని కళాశాల జెకెసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి తెలిపారు.

బాలికల హాస్టల్‌కు గ్రైండర్ అందజేత

ప్రజాశక్తి- కడియం

కడియం బాలికల వసతి గృహంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక వెలుగుబంటి యూత్ ఆధ్వర్యంలో మిక్సర్ గ్రైండర్‌ను ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని చేతులు మీదుగా వార్డెన్‌కు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి బాలికలకు పంచారు. ఈ కార్యక్రమంలో వెలుగుబంటి యూత్ సభ్యులు చిరుకూరి ప్రభ, గోకర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల వద్ద వసూళ్ల దందా

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు- పెండ్యాల తీపర్రు ఇసుక ర్యాంప్, స్టాక్ పాయింట్ల వద్ద అదనపు వసూళ్ల దందా యథేచ్ఛగా సాగుతోందని ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. అధికారుల పర్యవేక్షణాలోపం కారణంగా ఇది నీరుగారుతోంది. ర్యాంపుల వద్ద దళారుల రాజ్యం సాగుతోంది. సోమవారం పెండ్యాల ఇసుక ర్యాంపులో లోడింగ్ ఛార్జీ రూ.500 చెల్లించాల్సి ఉంది. కాని ఇక్కడ మరో రూ.500 నుంచి రూ.700 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. కనీసం రూ.500 కూడా ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. అదనపు అదనపు వసూళ్లపై ఈ నెల 10న మంత్రి దుర్గేష్ నిడదవోలులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ దళారుల దందా మాత్రం ఎక్కడా ఆగడం లేదు. అజ్జరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్ ఇసుక నిమిత్తం రూ.500 చెల్లించాడు. అదనంగా మరో రూ.700 డిమాండ్ చేశారని ఆయన తెలిపాడు. తన వద్ద రూ.900 వసూలు చేశారని తాడిపర్రుకు చెందిన గంధం సుబ్బారావు తెలిపారు.



తీపర్రు ఇసుక ర్యాంపు వద్ద డ్రైబర్లు, నిర్వహకులు

డిసెంబర్ 14న ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి- కడియం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ డిసెంబర్ 14న రాజమండ్రి జెఎన్ రోడ్డులో గల జె.కె గార్డెన్స్‌లో జరుగుతుందని నాయకులు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులు గురువారం కడియం సిహెచ్‌సిని సందర్శించి సమావేశం నిర్వహించారు. 56 శాఖల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం కె.ఆర్. సూర్యనారాయణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పాటైందనిజిల్లా కార్యదర్శి సిహెచ్ విల్సన్ పాల్ తెలిపారు. సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ మాధురి ముఖ్యఅతిథిగా పాల్గొనగా తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, పి.మురళీకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.శ్రీధర్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.నాగసాయిమౌర్య, జాయింట్ సెక్రటరీ వి.ఉమ పాల్గొన్నారు

టిడిపి ఆధ్వర్యంలో ఎంఎల్‌సి ఓటు నమోదు

ప్రజాశక్తి-గోకవరం

జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు మండలంలో టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో ఎంఎల్‌సి ఓటు నమోదను నిర్వహించారు. పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించడం బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోర్త చిట్టిబాబు, పి.శ్రీనివాసరావు, మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, ఎంపిటిసి మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, లంక హరిబాబు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - తాళ్లపూడి



నియోజకవర్గ నాయకులు రాజీవ్‌కృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు గురువారం టిడిపిలో చేరారు. మంత్రి నారా లోకేష్ రాజీవ్‌కృష్ణ తదితరులకు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజీవ్‌కృష్ణ వెంట తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి మండల నాయకులు నక్క చిట్టిబాబు, మదన్‌మోహన్‌రెడ్డి, నీలం భద్రరావు, కొల్లి చిన్న, తాడిపూడికి చెందిన నామ సురేంద్ర, కరుణాకర్ ఉన్నారు. నియోజకవర్గ పరిధిలోని కొవ్వూరు, చాగల్లు మండలాలకు చెందిన నాయకులు టిడిపిలో చేరారు.

'జ్యోతుల' ఫౌండేషన్ ద్వారా 'పెళ్లి కానుక'

గోకవరం : జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో వదువు కర్రి లక్ష్మికి గురువారం నవ వధువుకు రూ.20 వేల చెక్కును క్లస్టర్-2 ఇన్‌ఛార్జి ఉంగరాల రాము, టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రాము ఆధ్వర్యంలో అందించారు. వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ నెహ్రూ, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు నవీన్‌కుమార్ ఆదేశాలతో వీటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కోలా ఏసుబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, కోట పెదసూరిబాబు, పిట్టా అరుణ్, ఆకుల కాశి, నల్లల నాగేశ్వరరావు, నారా ప్రసాద్, మండిగ గంగాధర్, పి.అచ్చయ్య, డి.సురేష్ కుమార్, మద్ద చిట్టియ్య పాల్గొన్నారు.

బొబ్బిలంక విద్యార్థికి జిల్లా స్థాయి బహుమతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో బొబ్బిల్లంక జడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని అరిగెల దివ్యకు తృతీయ బహుమతి లభించిందది. రాజమండ్రిలో జరిగిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి, డిఎస్ఇఒ కె.వాసుదేవరావు ఆమెకు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా అరిగెల దివ్యను హెచ్ఎం కోలా సత్యనారాయణ, సర్పంచ్ రామచంద్రరావు, గ్రామ పెద్దలు పెండ్యాల ఆసిన్‌బాబు, ఎంపిటిసి సభ్యులు పోలిన కృష్ణ తదితరులు అభినందించారు.

కంటిపూడి విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక కంటిపూడి రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్ యాజమాన్యం వైద్య పరీక్షలను నిర్వహించింది. జనరల్ బాడీ చెక్ అప్, దంత సంరక్షణ, స్కిన్, ఇఎన్‌టికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారని హెచ్ఎం పులుగుర్త దుర్గాప్రసాద్ తెలిపారు. అవసరమైన వారికి స్వతంత్రలో ఆసుపత్రిలో లేదా జిఎస్ఎల్‌లో ఉచిత వైద్యం అందిస్తామని, 50 శాతం రాయితీపై మందులు అందిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కె.నిఖిత, వి.శారద, టిఎస్.కిరణ్, టి.మోహన్‌కళ్యాణ్, జి.సాయిసందీప్, ఎస్ఎంసి వైస్ చైర్మన్ డి.దేవి, ఉపాధ్యాయులు మోహన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు